ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శనివారం 20 జనవరి 2024

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహేశ్వరం, జనవరి 19 : మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్స్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంగి రమేష్ తెలిపారు. తెలుగు 1, ఇంగ్లీషు 1, కామర్స్ 1, కంప్యూటర్‌సైన్స్ 1, పోస్టులకు అవకాశం ఉందని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారికి పీజీలో 55శాతం మార్కులుండాలని పీహెచ్‌డీ, నీట్, ఎస్‌ఈటీ బోధనానుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఆసక్తిగల వారు 22వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు మహేశ్వరంలోని డిగ్రీ కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 9440447737 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

సీఎంఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి

» జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జనవరి 19 : ఈ నెలాఖరు వరకు సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.శశాంక తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో సీఎంఆర్ మిల్లింగ్ ప్రక్రియపై పౌర సరఫరాల అధికారులు, సంస్థ మేనేజర్, మిల్లర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు మిల్లర్లకు కేటాయించిన లక్ష్యం మేరకు సీఎంఆర్ మిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. ఈ ప్రక్రియపై పౌర సరఫరాల అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని, జాప్యానికి తావు లేకుండా చూడాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న మిల్లర్ల నుండి వెంటనే మిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు ఇతర మిల్లులకు కేటాయింపు చేయాలని పౌర సరఫరాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, పౌరసరఫరాల అధికారి మనోహర్ రాథోడ్, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ విజయలక్ష్మి, మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, మిల్లర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రత్యేకంగా ఓట్ల నమోదు

నేడు, రేపు ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కె.శశాంక తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు అంకితభావంతో కృషి చేయాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు ఓటరు ముసాయిదా జాబితాను పరిశీలించి ఏవైనా మార్పులు, చేర్పులు, సవరణలు, తొలగింపులు చేపట్టాల్సి ఉన్నట్లయితే, ఫారం 7, 8 ద్వారా సరి చేసుకునేలా చూడాలన్నారు. త్వరలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటరు జాబితాలో అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరూ తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బూత్ లెవెల్ అధికారులకు ఆయన సూచించారు.

ఓటరు నమోదుపై దృష్టి కేంద్రీకరిస్తున్నాం

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంపై దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం సందర్భంగా శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఓటరు నమోదుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పూర్తి చేస్తామని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఇప్పటికే సమావేశాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ప్రతి బుధ, గురు వారాల్లో జిల్లాస్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఆర్డీవోలు సూరజ్‌కుమార్, సాయిరామ్, శ్రీనివాస్, మలయ్య, అనంతరెడ్డి, ఎన్నికల విభాగం అధికారి సైదులు, డిప్యూటీ తహసల్దార్ బీఎస్ కుమారి, అధికారులు పాల్గొన్నారు.

మెస్ బిల్లులేవీ!

ఉమ్మడి జిల్లాలో 4 నెలలుగా అందని మెస్‌చార్జీలు

మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ బాలికల హాస్టళ్లో నాలుగు నెలలుగా మెస్ బిల్లులు రాక వార్డెన్లకు ఇబ్బందిగా మారింది. నిత్యావసర సరుకులు, కూరగాయలు, చికెన్, గుడ్లు, పండ్లు, గ్యాస్ కొనుగోలుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎలాగోలా సరుకులు తెచ్చి నిర్దేశిత మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనం పెట్టలేని పరిస్థితి నెలకొంది. కొందరు వార్డెన్లు వడ్డీలకు డబ్బులు తెచ్చి వండి పెడుతున్నారు. మరికొందరు ఉద్దెరకు సరుకులు కొనుగోలు చేస్తున్నారు. మెస్ బకాయిలు రూ.లక్షల్లో పేరుకుపోతున్నాయని, దీంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నామని వార్డెన్లు, కేర్‌టేకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలకు సంబంధించిన మెస్ బిల్లుల కోసం వారు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు.



చేవెళ్లలోని మోడల్ స్కూల్ హాస్టల్

రూ.లక్షల్లో బిల్లులు పెండింగ్

ఒక్కో మోడల్ హాస్టల్‌లో వంద మంది వరకు ఉంటారు. ఒక విద్యార్థినికి రూ.40.27 చెల్లిస్తున్నారు. ఒక హాస్టల్లో నెలకు రూ.1.90లక్షల వరకు మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో శంకర్‌పల్లి మినహా మిగతా 8 హాస్టళ్లలో సుమారు రూ.60.80 లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. వికారాబాద్‌లో సుమారు 45.60లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

పాత బిల్లులు చెల్లిస్తేనే సరుకులు ఇస్తామంటున్న టెండర్‌దారులు

» అప్పులు చేసి మోడల్ హాస్టల్స్‌ను నెట్టుకొస్తున్న వార్డెన్లు
» చేవెళ్ల మోడల్ స్కూల్ హాస్టల్లో సరుకులు లేక భోజనం బంద్
» హోటల్ నుంచి భోజనం తెచ్చి పెడుతున్న తల్లిదండ్రులు » ఇంటిబాట పడుతున్న విద్యార్థినులు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జనవరి 19 : రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలో మొత్తం 15 మోడల్ స్కూల్స్ ఉన్నాయి. మోడల్ స్కూళ్లలో చదువుకుంటున్న ఇంటర్ విద్యార్థినులకు ప్రభుత్వం పక్కనే వసతిగృహాన్ని ఏర్పాటు చేసింది. ఒక్కో మోడల్ హాస్టల్‌లో వందమంది విద్యార్థినులు ఉంటున్నారు. రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల, షాబాద్, ఇబ్రహీంపట్నం పరిధి బొంగ్లూరు, శంషాబాద్ మండలం పాల్మాకుల, యాచారం మండలం గునగల్, మహేశ్వరం, మంచాల మండలం ఆరుట్ల, కందుకూరు, శంకర్‌పల్లిలో మోడల్ స్కూల్స్ కొనసాగుతున్నాయి. శంకర్‌పల్లి మినహా అన్ని మండలాల్లో ఇంటర్ విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం కల్పించారు. అలాగే వికారాబాద్ జిల్లాలో పూడూరు మండలం ఎన్కేపల్లి, తాండూరులోని జినగుర్తి, పరిగిలోని జార్‌పల్లి, కుల్కచర్ల పరిధిలోని ముజాయత్‌పూర్, నవాబుపేట, మర్పల్లిలో మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.



తిరిగి ఇంటికి వెళ్తున్న ఇంటర్ విద్యార్థిని

మోడల్ స్కూల్లో ఇంటర్ చదువుతూ పక్కనే ఉన్న హాస్టల్లో ఉంటున్నారు. అయితే, వీరికి నాలుగు నెలలుగా మెస్ బిల్లులు రాలేవు. దీంతో వార్డెన్, కేర్‌టేకర్లు పాలు, కూరగాయలు, పండ్లు, చికెన్, వాటర్ బిల్లులు చేతి నుంచి చెల్లిస్తున్నారు. కొంత మంది వడ్డీకి తీసుకువచ్చి హాస్టల్స్‌ను నెట్టుకొస్తున్నారు. చేసిన అప్పులు కుప్పలు కావడం.. కిరాణ దుకాణ యజమానులు సరుకులు ఇవ్వక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

చేవెళ్లలో వంట బంద్

చేవెళ్లలోని మోడల్ స్కూల్‌లోని ఇంటర్ బాలికల వసతి గృహంలో వంద మంది విద్యార్థినులు ఉంటున్నారు. ఈ వసతి గృహంలో సరుకులు అయిపోవడంతో.. ఈ నెల 18 (గురువారం) వంట చేయడం మానేశారు. సంక్రాంతి సెలవులు అయిపోయి తిరిగి హాస్టల్స్‌కు వచ్చిన విద్యార్థులు ఆకలితో ఇబ్బందులు పడ్డారు. తల్లిదండ్రులు హోటల్ నుంచి భోజనం తీసుకు వచ్చి తినిపించారు. మరికొందరు ఇంటి నుంచే టిఫిన్స్ పంపించారు. మోడల్ టీచర్లు హాస్టల్ విద్యార్థినులకు స్కూల్లో వండిన మధ్యాహ్నం భోజనం వడ్డించేలా చర్యలు తీసుకున్నారు.

సరుకులు లేవని ఇంటికి పంపించారు



మాది వికారాబాద్, చేవెళ్లలోని మోడల్ స్కూల్లో సీటు రావడంతో ఇక్కడే హాస్టల్లో ఉండి చదువుకుంటున్నాను. సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్లి తిరిగి హాస్టల్‌కు లగేజీతో వచ్చాను. హాస్టల్‌లో సరుకులు లేవని తిరిగి పంపించారు. లగేజి మా నాన్న తీసుకెళ్లాడు. మధ్యాహ్న భోజనం స్కూల్లో చేశాను.

- శైలజ, బీపీసీ, ఇంటర్ ఫస్టియర్, చేవెళ్ల

ఇంటినుంచి టిఫిన్ బాక్స్ తెచ్చుకున్నా



మాది షాద్‌నగర్. ఇంటి నుంచి వచ్చేటప్పుడు మమ్మీ టిఫిన్ పంపింది. హాస్టల్‌కు వచ్చాక భోజనం లేదని తెలిసింది. ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తినేశాను. ఫ్రీ బస్సు సౌకర్యం ఉండటంతో నేను సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్లాను.

- సాయిలక్ష్మి, విద్యార్థిని, చేవెళ్ల

అప్పులు చేసి భోజనం పెడుతున్నాం



అప్పులు చేసి పిల్లలకు భోజనం పెడుతున్నాం. ఇప్పటి వరకు నాలుగు నెలల మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే మా జీతాలు కూడా రాలేవు. ఇప్పటికే రూ. 45వేలు వడ్డీకి తీసుకు వచ్చాను. పాలు, చికెన్, గ్యాస్, గుడ్లు, డ్రింకింగ్ వాటర్‌కు వారంలో బిల్లులు వస్తాయని చెప్పుకుంటూ.. సరుకులు తెస్తున్నాను. ప్రస్తుతం సరుకులు ఇవ్వడం లేదు. టెండర్ దారుడు పాత బిల్లులు ఇస్తేనే కొత్తగా సరుకులు సరఫరా చేస్తామంటున్నారు. ప్రస్తుతం అరకొర సరుకులున్నాయి. పిల్లలు అందరూ వస్తే భోజనం పెట్టే పరిస్థితి లేదు. హాస్టల్ కరెంట్ బిల్లు కూడా 55 వేల వరకు పెండింగ్ ఉంది. బిల్లు కట్టకుంటే కరెంట్ కట్ చేస్తామంటున్నారు.

- విజయలక్ష్మి, కేర్‌టేకర్, చేవెళ్ల మోడల్ స్కూల్

హోటల్ నుంచి భోజనం తెచ్చి ఇచ్చాను



నా బిడ్డ ఇంటర్ చదువుతుంది. ఉదయం మోడల్ స్కూల్ వద్ద దింపి వెళ్లాను. హాస్టల్ కొనసాగడం లేదని తెల్వడంతో.. ఇక్కడే ఉండి మధ్యాహ్న భోజనం హోటల్ నుంచి తీసుకు వచ్చి ఇచ్చాను. సాయంత్రం మళ్లీ నా బిడ్డను ఇంటికి తీసుకు వెళ్లాను. హాస్టల్లో సరుకులు లేవని భోజనం బంద్ పెట్టారు.

- మల్లేష్, విద్యార్థిని తండ్రి, చేగూరు, నందిగామ మండలం

వారం రోజుల్లో క్లియర్ చేస్తాం



పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను వారంలోగా క్లియర్ చేస్తాం. వచ్చిన బడ్జెన్‌ను అడ్జెస్ట్ చేస్తున్నాం. మోడల్ స్కూల్ హాస్టల్స్ కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నాం.

- సుశీందర్‌రావు, జిల్లా విద్యాధికారి, రంగారెడ్డి

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బొక్క నర్సింహారెడ్డి

వరుసగా నాల్గోసారి వరించిన పదవి



రంగారెడ్డి అర్బన్, జనవరి 19 : రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా బొక్క నర్సింహారెడ్డిని ఆ పార్టీ నియమించింది. నర్సింహారెడ్డి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక కావడం ఇది వరుసగా నాలుగోసారి లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో మెజారిటీ సీట్లే లక్ష్యంగా ముందుకెళుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుల నియామయం చేపట్టింది. దీనిలో భాగంగానే బొక్క నర్సింహారెడ్డికి మరోసారి అవకాశం దక్కింది. వరుసగా ఆయనను నాలుగో సారి జిల్లా అధ్యక్ష పదవి వరించింది. నర్సింహారెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, ఆ తర్వాత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2016 నుంచి నేటి వరకు జిల్లా అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి తనపై నమ్మకం ఉంచి మరోసారి పార్టీ అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, రానున్న ఎంపీ ఎన్నికల్లో పార్టీ జెండాను ఎగరవేసేలా సమన్వయంతో ముందుకు సాగనున్నట్లు తెలిపారు. తనకు జిల్లా పార్టీ పగ్గాలు అప్పగించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



దర్గా ఆవరణలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో దీపారాధన

» రెండో రోజూ జేపీ దర్గాలో ఘనంగా ఉర్సు వేడుకలు » పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తజనం

కొత్తూర్, జనవరి 19: హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా ఉర్సు వేడుకల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం దీపారాధన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు వేలాదిగా తరలివచ్చి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మరి కొందరు చిన్నారులకు తలవెంట్రుకలను తీయించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కాగా, దర్గా ఆవరణలో భక్తులు పెద్దఎత్తున దీపాలు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేయడం అనవాయితీ. ఆర్టీసీ బస్సు ప్రయాణం ఉచితం కావడంతో మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దర్గాలో ప్రార్థనల అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. ముఖ్యంగా నగరం నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుని నియాజ్‌లు నిర్వహించి అన్నదానాలు చేశారు. ఓ వైపు విద్యుత్ దీపాలంకరణ, మరోవైపు దీపారాధనలతో దర్గా ప్రాంతం ధగధగ మెరిసిపోయింది. ఉర్సు సందర్భంగా దర్గా ప్రాంతం భక్తులతో కిక్కిరిసిపోయింది. కొత్తూర్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఉర్సు ఉత్సవాలకు హాజరైన జనసందోహం

ఎమ్మెల్యే ఉదారత.. 50వేల వాటర్‌బాటిళ్ల పంపిణీ

ఉర్సును పురస్కరించుకొని దర్గాకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సొంత ఖర్చుతో రూ.50వేల వాటర్‌బాటిళ్లను సమకూర్చారు. సీడబ్ల్యూసీ మెంబర్ వంశీచంద్‌రెడ్డితో కలిసి వాటర్‌బాటిళ్లను గురువారం రాత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి ఎమ్మెల్యే శంకర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. దర్గాకు వచ్చిన వేలాదిమంది భక్తులు సైతం ఎమ్మెల్యే వీర్లపల్లికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

శంకుస్థాపనతోనే సరి!

ప్రారంభానికి నోచని పశు వీర్య ఉత్పత్తి కేంద్రం

ఎనిమిదేళ్ల క్రితం కంసాన్‌పల్లిలో కేంద్రానికి శంకుస్థాపన

» ప్రభుత్వ అలసత్వం » పాడి రైతులకు తప్పని నిరాశ
» నీటి సౌకర్యం లేక ఎండుతున్న పశుగ్రాసం

షాద్‌నగర్ రూరల్, జనవరి 19 : సాగునీటి వనరులు లేక వర్షాధార పంటలపై ఆధారపడి జీవించే షాద్‌నగర్ ప్రాంత రైతులకు మేలైన పశుసంపదను అందించాలనే లక్ష్యంతో ఎనిమిదేళ్ల క్రితం ఘనీకృత పశు వీర్య ఉత్పత్తి కేంద్రానికి శంకుస్థాపన చేశారు. కాగా, పనులు మాత్రం ముందుకుసాగడం లేదనే విమర్శలున్నాయి. ప్రభుత్వ అలసత్వంతో పాడి రైతుల ఆశలు ఆవిరైపోయాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోనే రెండవ ఘనీకృత పశు వీర్య ఉత్పత్తి కేంద్రం ఫరూఖ్‌నగర్ మండలం కాంసాన్‌పల్లిలో ఏర్పాటు చేసేందుకు 12 మే 2015లో అప్పటి పశు సంవర్ధకశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కేంద్రం 26 ఎకరాల్లో విస్తరించి ఉండగా.. నిర్మాణానికి రూ.16 కోట్ల నిధులు కూడా విడుదల చేశారు.



పశువుల కోసం నిర్మించిన షెడ్డు

పాడి రైతులకు ఎంతో మేలు



ఘనీకృత పశు వీర్య ఉత్పత్తి కేంద్రం అందుబాటులోకి వస్తే పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. పనులు త్వరగా పూర్తి చేయాలి. ఈ ప్రాంత ప్రజలు ఎక్కువగా పాడిపరిశ్రమపై ఆధారపడి జీవిస్తారు. ప్రభుత్వం పనులు త్వరగా పూర్తి చేయాలి.

- శ్యాంసుందర్, రైతు, మొగిలిగిద్ద

మేలుజాతి పశు సంపద పెంపే లక్ష్యం

రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపర్చడమే కాకుండా మేలుజాతి పశు సంపదను పెంచాలనే లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం కరీంనగర్ జిల్లాలో మొదటిసారి పెద్దఎత్తున ఘనీకృత పశువీర్య ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దక్షిణ తెలంగాణలో కూడా హెచ్‌ఎఫ్ జెర్సీ, ఒంగోలు జాతికి గిత్తలు, ముర్రాగేదెల సంఖ్యను పెంచాలనే ఉద్దేశ్యంతో కాంసాన్‌పల్లిలో మరో కేంద్రాన్ని ప్రారంభించినా పనులు మాత్రం ఎనిమిదేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. దేశవాళీ పశువులను కూడా ఈ కేంద్రంలో అభివృద్ధి చేయాలని సంకల్పించారు.



కానీ, పశువీర్య ఉత్పత్తి కేంద్రం పనులు ఆలస్యం కావడంతో ఈ ప్రాంత పాడిరైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. అయితే, కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదని, దాంతో పనులు పూర్తి స్థాయిలో చేపట్టలేదని సమాచారం. ఈ విషయంలో అధికారులు మాత్రం నోరు మెదపడం లేదు. ఏ అధికారిని కదిలించినా.. ఎటువంటి సమాచారం చెప్పవద్దని, ఉన్నతాధికారుల ఆదేశాలున్నాయని, అంతా కాన్ఫిడెన్షియల్ అంటూ సమాధానం దాటవేస్తున్నారు. కాగా, ల్యాబ్ ఏర్పాటు చేసినా ఎక్విప్‌మెంట్ పూర్తిస్థాయిలో అందుబాటులో లేదని సమాచారం.

నీటి సౌకర్యం లేకుండానే పశుగ్రాసం పెంపకం

పశువుల(బుల్స్)కు మేత కోసం 17 ఎకరాల్లో పశుగ్రాసం పెంచాలని నిర్ణయించారు. అయితే, నీటి సౌకర్యం లేకుండానే సుమారు 5 ఎకరాల్లో పశుగ్రాసం పెంచారు. గతేడాది జూన్‌లో పశుగ్రాసం పెంచేందుకు చర్యలు తీసుకోగా.. ప్రస్తుతం నీరులేక మొత్తం ఎండిపోతోంది. బోరు ద్వారా నీటి సౌకర్యం కల్పించడం లేదు. వాటర్ ట్యాంకు నిర్మించినా గ్రాసానికి నీరందించేందుకు పైప్‌లైన్ ఏర్పాటు చేయలేదు.

డాక్టర్లు, సిబ్బంది క్వార్టర్లు సిద్ధం

పశువీర్య ఉత్పత్తి కేంద్రంలో పని చేయడానికి అవసరమైన డాక్టర్లు, సిబ్బందికి ఉండేందుకుగాను క్వార్టర్లు సిద్ధం చేశారు. బుల్స్‌ను ఉంచేందుకు అవసరమై షెడ్ల నిర్మాణం, ఇతర సౌకర్యాలు పూర్తిచేయడంలో మాత్రం అధికారులు చొరవ చూపడం లేదనే విమర్శలున్నాయి. పశువీర్య ఉత్పత్తి కేంద్రం అందుబాటులోకి వస్తే మేలుజాతి పశువుల ఉత్పత్తి పెరిగి రైతులకు మేలు జరుగుతుంది. వారి ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపడుతుంది. కాగా, ల్యాబ్‌లో కూడా సరైన ఎక్విప్‌మెంట్ లేదనే ప్రచారం సాగుతోంది.

పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి

పశువీర్య ఉత్పత్తి కేంద్రం పనుల్లో వేగం పెంచాలి. ఈ సెంటర్ వల్ల పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. శంకుస్థాపన చేసి ఎనిదేళ్లు అవుతున్నా పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలి.



నీటి సౌకర్యం లేక ఎండుతున్న పశుగ్రాసం

తాండూరు రూరల్, జనవరి 19 : మండలంలోని అంతారం పరిధి దస్తగిరిపేట్ వేంకటేశ్వరస్వామి ఆలయ భూములను ఎవరైనా కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర దేవాదాయ శాఖ భూముల విభాగం డిప్యూటీ కలెక్టర్ అనిత, తహసీల్దార్ హరితాదేవి హెచ్చరించారు. శుక్రవారం అంతారం

ఆలయ భూములను కబ్జా చేస్తే చర్యలు



వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బోర్డును ఏర్పాటు చేయిస్తున్న ఎండోమెంట్ డిప్యూటీ కలెక్టర్ అనిత, తహసీల్దార్ హరితాదేవి

గ్రామ శివారులోని దస్తగిరిపేట్‌లలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన సర్వే నంబర్లు 50, 161, 162, 177, 179లలో మొత్తం 57ఎకరాల 29గుంటల భూమి ఉందని తెలిపారు. ఈ మేరకు గ్రామ ప్రజలకు తెలియజేసే విధంగా దేవాదాయ శాఖ రెవెన్యూ విభాగం సమక్షంలో సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారి అనిత మాట్లాడుతూ.. ఈ భూములు వేంకటేశ్వరస్వామి ఆలయ భూములని, వీటిని ఎవరూ ఆక్రమించొద్దని బోర్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ భూములపై హక్కులన్నీ ఎండోమెంట్ శాఖకే చెందుతాయన్నారు. ఇక్కడ ఆక్రమణలు, కొనుగోళ్లు, అమ్మకాలు నిషిద్ధం అన్నారు. అలాంటి ప్రయత్నాలు చేసే చట్టపరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ భూములు కబ్జా చేసినట్టు గతంలో ఫిర్యాదులందాయని, వాటిపై కొన్ని నెలల క్రితం వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. అధికారుల వెంట భద్రేశ్వర ఆలయ ఈవో శేఖర్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, గ్రామస్తులు ఆశన్న, అంబరీశ్, మొగులప్ప, బీజే.శ్రీనివాస్, రజనికాంత్, స్వామిదాస్ ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బషీరాబాద్, జనవరి 19: కాంగ్రెస్ ప్రభుత్వాల్లోనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కంసాన్‌పల్లి(బి), ఎక్మాయి, మంతన్‌గౌడ్, అల్లాపూర్, దామర్‌చెడ్, వాల్యానాయక్‌తండా, జమ్లానాయక్‌తండా గ్రామాల్లో ఆయన పర్యటించి కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అంతకు ముందు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఎమ్మెల్యేను సన్మానించారు. గ్రామ సభల్లో ఎమ్మెల్యే మట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రాజెక్టుల పేరిట నాయకులు అవినీతికి పాల్పడ్డారన్నారు. రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. ఎన్నో హామీలిచ్చినా ఒక్క పథకాన్నీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో నియోజకవర్గానికి భారీగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. తనకు ఓటు వేసిన ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. ఆరు గ్యారంటీలను తప్పక అమలు చేస్తామన్నారు. త్వరలో 2లక్షల ఉద్యోగాల భర్తీకి ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ శాంతాబాయి, నవాంద్గి ప్యాక్స్ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు జి.మాధవరెడ్డి, ఎస్.వెంకటేష్‌మహరాజ్, రోహత్‌మహరాజ్, పార్టీ అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, నాయకులు లక్ష్మణ్‌రావు, రాజేందర్‌రెడ్డి, క్యాద్గిరా భీమ్, శంకర్‌నాయక్, జయరాం, సర్పంచ్‌లు నదీర్గ నారాయణ, నర్సిరెడ్డి, శివ, వార్డుమెంబర్ సిద్ధార్థ, పవాన్ పాల్గొన్నారు.



వాల్యానాయక్ తండా సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గజేందర్‌గౌడ్

భూ సమస్యలు పరిష్కరించాలి

షాబాద్, జనవరి 19 : రాష్ట్రవ్యాప్తంగా భూసమస్యలు పరిష్కారయ్యేందుకు ప్రభుత్వం వెంటనే భూముల సర్వే నిర్వహించాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని నాగర్‌గూడ సమీపంలోగల శ్రీకృష్ణ ఆలయం ప్రాంగణంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గడిగె గజేందర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాధవరెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి నరేందర్‌రెడ్డిలతో కలిసి జిల్లాస్థాయి రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం భూ సమస్యలతో వేగిపోతుందని, ధరణి పోర్టల్ పేరుతో గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల అనేక మంది రైతులు ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుత ప్రభుత్వం వెంటనే భూముల సర్వే నిర్వహించి టైటిల్ గ్యారంటీ ఇవ్వాలన్నారు. కమతాల ఏకీకరణ చేస్తే 80శాతం వరకు భూసమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. షాబాద్, చేవెళ్ల, శంషాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి, కొందుర్గు, చౌదరిగూడ, షాద్‌నగర్ మండలాల అధ్యక్షులు దండు యాదవరెడ్డి, ఆగిరెడ్డి, పెంటారెడ్డి, పాండురంగం, చంద్రమౌళి, జంగయ్య, రాంచంద్రయ్య, రైతులు పాల్గొన్నారు.



మండల కేంద్రంలో నిర్వహించిన జిల్లా కార్మిక సదస్సులో మాట్లాడుతున్న పి.జంగారెడ్డి

'కార్పొరేట్ల'కు కొమ్ము కాస్తున్న కేంద్రం

కందుకూరు జనవరి 19 : మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తోందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాషానరహరి భవనంలో ఆ పార్టీ నాయకుడు దుబ్బాక రాంచందర్ ఆధ్యక్షతన కార్మిక, కర్షక జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జంగారెడ్డి హాజరై మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలు లేకుండా చేస్తోందన్నారు. 4 లేబర్ కోడ్‌ల బిల్లుతో కార్మికరంగం కుదేలైపోయి కార్మికులు రోడ్డున పడే పరిస్థితులున్నాయని, రిలయన్స్ కంపెనీకి ప్రధాని కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు, ఎస్.రాజు, ఎం.చంద్రమోహన్, నాయకులు మధుసూదన్ రెడ్డి, అంజయ్య, కె.జగన్, జగదీష్, కిషన్, సీహెచ్ జంగయ్య, కుమార్, శేఖర్, కృష్ణ, బ్రహ్మయ్య, ఎ.కుమార్, కురుమయ్య, మునలయ్య, శేఖర్ రెడ్డి, బాషయ్య, స్వప్న, పాల్గొన్నారు.



ఫిరంగి నాలాలో నిలిచిన మురుగు, చెత్తాచెదారం

వ్యర్థాలతో నిండుకున్న ఫిరంగి నాలా

▸▸ దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు

శంషాబాద్, జనవరి 19: మునిసిపల్ కేంద్రంలో బస్తీల మధ్య ఉన్న ఫిరంగినాలా వ్యర్థాలతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దాంతో ఆయా బస్తీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మధురానగర్, రంగారెడ్డి-భుజంగరెడ్డినగర్, మిషన్‌కాంపౌండ్, సాతంరాయి తదితర ప్రాంతల్లో ఫిరంగినాలా విస్తరించి ఉంది. ఈ నాలాలో కొన్ని చోట్ల మురుగునీరు నిండిపోవడంతో పందులు, కుక్కలు ఆవాసముంటున్నాయి. సాయంత్రమైతే కాలువలోని దోమలు ఇళ్లలోకి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మునిపల్ అధికారులు కాలువలో కొన్నిచోట్ల పూడిక తీయించగా, మరికొన్ని చోట్ల పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దాంతో ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీరంతా కాల్వలో చేరడంతో పూర్తిగా మురుగు నీరు చేరి దుర్గంధం ఎక్కువైంది. మునిపల్ కార్యవర్గం చర్యలు తీసుకొని ఫిరంగినాలాలోని మురుగు నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని బస్తీవాసులు కోరుతున్నారు.

నేడు, రేపు కిసాన్ మహోత్సవం

మేడ్చల్ టౌన్, జనవరి 19 : ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే రెండు రోజులు కిసాన్ మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం అవుతాయని శుక్రవారం నిర్వాహకులు తెలిపారు. గుండ్లపోచంపల్లి పరిధి మైసమ్మగూడ మల్లారెడ్డి స్కూల్ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ కాలేజీలో ఈ మహోత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఐకార్ క్రీడా మాజీ డైరెక్టర్ బి.వెంకటేశ్వరులు, మల్లారెడ్డి యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ వీ.ఎస్.కే.రెడ్డి, రిజిస్ట్రార్ ఎం.ఆంజనేయులు, అగ్రికల్చర్ స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ఎ.రాజిరెడ్డి పాల్గొంటారన్నారు. వ్యవసాయరంగంలో ప్రత్యేక సేవలందించిన వారికి అవార్డులు ప్రదానం చేస్తారని, వ్యవసాయ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు శాస్త్రవేత్తలతో ఇష్టాగోష్ఠి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వివరించారు.

కొట్టుకున్న కాంగ్రెస్ నాయకులు

▸▸ ఇరువర్గాల ఘర్షణ ▸▸ అదుపు చేసిన పోలీసులు

బషీరాబాద్, జనవరి 19: మండలంలోని ఎక్మాయిలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి కొట్లాడుకున్నారు. దీంతో అక్కడున్న పోలీసులు వారిని చెదరగొట్టి అదుపు చేశారు. కాంగ్రెస్ జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఎక్మాయికి వచ్చారు. ఎమ్మెల్యే, ముఖ్య శ్రేణులతో కలిసి సభలో కూర్చున్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే గెలుపునకు తామే కృషిచేశామని యువ నాయకులు కొందరు సభలో పెత్తనంచేస్తూ సీనియర్లను పట్టించుకోలేదు. దీంతో నాయకుల మధ్య అధిపత్య పోరు ముదిరింది. ఎమ్మెల్యే తన ప్రసంగాన్ని ముగించి వెళ్లిపోయారు. అనంతరం గ్రామ నాయకులు ఒక్కసారిగా ఆరుచుకుంటూ ఇరువర్గాలుగా వీడిపోయి కొట్టుకున్నారు. సీనియర్ నాయకుడు నారా గోపాల్‌రెడ్డి చొక్కా చినిగిపోయింది. దీంతో ఆయన అనుచరులు రెచ్చిపోయారు. పోలీసులు అప్రమత్తమై నాయకులను చెదరగొట్టే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. కొందరు నాయకులు పోలీసులపైకి సైతం లేచారు. పోలీసులు గొడవ మరింత పెద్దగ కాకుండా ఇరువర్గాలకు సర్దిచెప్పారు. త్వరలోనే రెండు వర్గాల నాయకులను పిలిపించి మట్లాడతానని ఎమ్మెల్యే చెప్పినట్లు ఓ నాయకుడు పేర్కొన్నారు.



కాంగ్రెస్ నాయకులను చెదరగొడుతున్న పోలీసులు

పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

చేవెళ్ల, జనవరి 19 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓట్ల లెక్కింపు, ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్‌రూమ్‌ల వంటి సదుపాయాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో గల బండారు శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాలను అధికారులతో కలిసి సందర్శించారు. అన్ని గదులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం, పరిగి, వికారాబాద్, తాండూర్‌లో ఎన్నికల నేపథ్యంలో ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తోందన్నారు. కౌంటింగ్ హాళ్లు, స్ట్రాంగ్ రూమ్‌లు, రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను ఈఆర్‌వో, సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. దాంతో పాటు కళాశాల భవన సముదాయానికి సంబంధించిన బ్లూప్రింట్(మ్యాప్)ను పరిశీలించారు. కౌటింగ్ ప్రక్రియ సాఫీగా నిర్వహించేందుకు బండారు శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాల అనుకూలంగా ఉంటుందా? లేదా? అనే విషయాలపై సమగ్రంగా పరిశీలన జరపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు ఉన్నారు.



బండారు శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాలలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

భూ ఆక్రమణకు పాల్పడిన నిందితులకు ఏడాది జైలు

యాచారం, జనవరి 19 : పట్టాభూమిని ఆక్రమించిన ముగ్గురు నిందితులకు ఏడాది జైలుశిక్షతో పాటు, ఒక్కొక్కరికి రూ. 500 జరిమానా విధిస్తూ ఇబ్రహీంపట్నం 16వ మెట్రోపాలిటన్ న్యాయమూర్తి హిమబిందు శుక్రవారం తీర్పునిచ్చారు. కోర్టు మున్షి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం యాచారం మండలంలోని బొల్లిగుట్టతండాలోని సర్వే నెంబర్ 360లో 4 ఎకరాల 23 గుంటల భూమిని ఎల్‌బీ నగర్‌కు చెందిన అనసూయ, జనార్దన్ రెడ్డి దంపతులు కొనుగోలు చేశారు. ఈ భూమిని బొల్లిగుట్ట తండాకు చెందిన మాన్‌సింగ్ కౌలు చేస్తున్నాడు. కాగా చాంద్రాయణగుట్టకు చెందిన ఎండీ బషీర్, నజీర్, జాహంద్‌లు ఈభూమిపై కన్నేసి భూ ఆక్రమణకు పాల్పడి గోడ కట్టారు. తమ భూమిని ఆక్రమించడం సరికాదని బాధితులు నచ్చ చెప్పినా నిందితులు వినిపించుకోలేదు. దాంతో జనార్దన్ రెడ్డి, అనసూయ దంపతులు యాచారం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి రెవెన్యూ రికార్డులను పరిశీలించి పూర్తి వివరాలను కోర్టుకు సమర్పించారు. న్యాయమూర్తి హిమబిందు వివరాలను పరిశీలించి భూ ఆక్రమణకు పాల్పడిన ఎండీ బషీర్, నజీర్, జాహంద్‌లకు ఏడాది చొప్పున జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.



చేవెళ్లలోని బస్‌స్టేషన్‌లో ఎయిడ్స్, హెచ్‌ఐవీ పట్ల అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల, జనవరి 19 : ప్రతీ ఒక్కరు హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఓఆర్‌డబ్ల్యూ ఎం.గీత, నీరజ తెలిపారు. ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం చేవెళ్లలోని బస్‌స్టేషన్, శంకర్‌పల్లి చౌరస్తాలో పల్లె సందులవారి కళా ప్రదర్శనతో ఎయిడ్స్, హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, రక్షణ లేకుండా సెక్స్‌లో పాల్గొనడం, హెచ్‌ఐవీ ఉన్న వారికి వాడిన సూదులు, సిరంజీలను ఇతరులకు వాడటం, హెచ్‌ఐవీ సోకిన వారి రక్తాన్ని మరొకరికి ఎక్కించడం వల్ల హెచ్‌ఐవీ సోకుతుందని తెలిపారు. హెచ్‌ఐవీ ఉన్న తల్లుల నుంచి పిల్లలకు, బిడ్డ కడుపులో ఉన్నప్పుడు, కాన్పు సమయంలో లేదా తల్లిపాల ద్వారా బిడ్డకు సోకవచ్చని తెలిపారు. సుఖవ్యాధులు ఉన్నవారికి హెచ్‌ఐవీ సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. హెచ్‌ఐవీ బారిన పడకుండా కండోమ్ ఉపయోగించాలని, సుఖవ్యాధులు రాకుండా చూసుకోవాలని, హెచ్‌ఐవీ పరీక్షలు, కౌన్సిలింగ్ చేయించుకోవాలని తెలిపారు. శృంగారంలో కండోమ్ తప్పనిసరిగా వినియోగించాలని, కండోమ్ చిరిగినా, జారినా, లీక్ అయినా హెచ్‌ఐవీ సంక్రమించే ప్రమాదం ఉందన్నారు. ప్రతీఒక్కరు హెచ్‌ఐవీ పరీక్ష చేయించుకోవాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పీఈలు విజయ, లత, సుహాసిని, కళాజాత బృందం సభ్యులు ఎం. శంకర్, పి. గణేష్, వి. ఎల్లయ్య, స్వప్న, సంపతయ్య, పాల్గొన్నారు.

పాములకే ప్రాణభిక్ష

▸▸ 200కి పైగా పాములను పట్టుకున్న ప్రదీప్‌కుమార్

▸▸ చంపకుండా అటవీ ప్రాంతంలో వదిలి పెట్టిన వైనం

బషీరాబాద్, జనవరి 19 : పాములంటే ప్రతి ఒక్కరికీ పుట్టెడు భయం.. పాము పేరు విన్న, చూసినా ఒక్కసారిగా పరుగులు తీస్తాము.. కొందరైతే పాము కనబడితే చాలు ప్రాణ భయంతో వెంటాడి కర్రలతో కొట్టి చంపుతారు... కానీ ఓ వ్యక్తి పాము ఎక్కడైనా ఉందని చెబితే వాటికి హాని కలగకుండా చాకచక్యంగా పట్టుకుని డబ్బాలో బంధించి అడవుల్లో వదులుతాడు. ఇప్పటివరకు 200కు పైగా పలు రకాల పాములను పట్టుకుని అడవుల్లో, జన సంచారం లేని ప్రదేశాల్లో వదిలి పెట్టి వాటికి ప్రాణబిక్ష పెడుతున్నాడు.

బషీరాబాద్ మండల కేంద్రానికి చెందిన ఎం. ప్రదీప్‌కుమార్ హోటల్ నడుపుతుంటాడు.తన చిన్ననాటి నుంచి పాములంటే ఆయనకు భయం లేదు. పదోతరగతి చదువుతున్నప్పుడూ ఎక్కడైనా పాము కనిపిస్తే చాలు ధైర్యంగా వాటిని పట్టుకునే ప్రయత్నం చేసేవాడు. అప్పట్లో ప్రదీప్ తనదైన శైలిలో పాములను పట్టేందుకు మెలకువలు ప్రదర్శించడం చూసి స్నేహితులు పొగడ్తలతో ముంచెత్తేవారు. ఎక్కడైనా ఇళ్లలో పాములు చొరబడితే వెంటాడి కొట్టి చంపడం చూసేవాడు. పాపం వాటిని ఎందుకు కొట్టి చంపాలి అంటూ మధనపడేవాడు. అప్పట్లో స్థానికంగా ఒకరి ఇంట్లో నాగుపాము కనిపించి బుసకొట్టడంతో ఇంటిల్లిపాది భయంతో బయటకు పరుగులు తీశారు. ఈ విషయం తెలుసుకున్న ప్రదీప్ అక్కడికి వెళ్లి నాగుపామును కర్ర సాయంతో చాకచక్యంగా పట్టుకుని ఎలాంటి హాని కలగనీయకుండా ప్లాస్టిక్ డబ్బాలో బంధించి ఊరి బయట వదిలిపెట్టి వచ్చాడు.



కొండచిలువను మెడలో వేసుకుని చూపిస్తూ ప్రజల్లో భయం పోగొడుతున్న ప్రదీప్‌కుమార్

ఈ క్రమంలో బషీరాబాద్‌తో పాటు పరిసార గ్రామాలు, కర్ణాటక సరిహద్దు ప్రాంత గ్రామాల్లో ఎక్కడైనా జనావాసాల్లో పాములు ఉంటే ప్రదీప్‌కు ఫోన్ చేస్తుంటారు. వెంటనే అక్కడికి చేరుకుని పామును పట్టి డబ్బాలో బంధించి అడవుల్లో వదిలిపెడతాడు. గత 30 ఏళ్లకు పైగా పాములను ఎవరూ చంపనీయకుండా పట్టుకుని అడవుల్లో వదిలి పెడుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

ఎన్నో జీవరాశుల్లో పాము ఒకటి

భూ ప్రపంచంలో ఎన్నో జీవరాశులు బతుకుతున్నాయి. వీటిలో ప్రాణహాని కలిగించే అనేక జీవరాశులతో పాములు కూడా ఒకటిగా జీవిస్తున్నాయి. ప్రాణహాని ఉందని చంపుకుంటూ పోతే ఏవీ మిగలవు. ఎక్కడైనా పాములు నివాస ప్రాంతల్లో కనిపిస్తే భయపడొద్దు. అటవీశాఖ అధికారులకు తెలియజేస్తే పట్టుకెళ్లి అడవుల్లో వదులుతారు. పాములు ఎవరిని పగబట్టవు. పాములను చూసి భయపడి మనమంతా ఎలా పరుగు తీస్తామో... అవి కూడా అంతే భయంతో పరుగు తీస్తుంటాయి. నివాస ప్రాంతాలు, ఇళ్లలో పాములున్నాయని తెలిస్తే పిలువకున్నా అక్కడికి వెళ్లి వాటిని పట్టుకుని ఊరి దూరంగా వదిలిపెడుతుంటాను.

ఔత్సాహిక విద్యార్థులకు విదేశీ విద్యనందించేందుకు కృషి

▸▸ సంస్కృతి ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాల డైరెక్టర్ డాక్టర్. ఎం రమాకాంత్‌రెడ్డి

ఘట్‌కేసర్, జనవరి 19 : ఔత్సాహిక విద్యార్థులకు విదేశీ విద్యనందించేందుకు సంస్కృతి ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల కృషి చేస్తుందని ఆ విద్యా సంస్థ డైరెక్టర్ డాక్టర్. ఎం రమాకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆ కళాశాలలో అమెరికాకు చెందిన ఓరెగాన్ యూనివర్సిటీ మార్కెటింగ్, రిక్రూట్‌మెంట్ మేనేజర్ టేలర్ నస్బానమ్‌తో కలిసి వాల్మీకి ఫారెన్ ఎడ్యుకేషన్ సంస్థ భాగస్వామ్యంతో ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కెరీర్ కౌన్సిలింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విదేశాల్లో విద్యావకాశాలు, ప్రవేశం పొందటంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రమాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ వాల్మీకి ఫారెన్ ఎడ్యుకేషన్ సంస్థ ఇప్పటి వరకు లక్ష మంది విద్యార్థులకు ఓవర్సీస్ విద్యపై అవగాహన కల్పించిందని, సుమారు 400యూనివర్సిటీల్లో 30వేల మందికి ఆయా యూనివర్సిటీల్లో ప్రవేశం కల్పించినట్లు తెలిపారు. 20రాష్ట్రాల్లో 1200కిపైగా ప్రతినిధులతో బలమైన ఎజంట్ నెట్ వర్క్‌ను కలిగి ఉందన్నారు. విద్యార్థులకు నమ్మశక్యమైన విద్యా సంస్థల్లో చేరికతో పాటు స్కాలర్ షిప్ అందజేయటం, మెరిట్ ఆధారంగా సీట్లు లభింపచేయటంలో వాల్మీకి ఫారెన్ ఎడ్యుకేషన్ సంస్థ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కిరణ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నీలం సింగ్, విద్యార్థులు, తదితరులుపాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమెరికాకు చెందిన ఓరెగాన్ యూనివర్సిటీ మార్కెటింగ్, రిక్రూట్‌మెంట్ మేనేజర్ టేలర్ నస్బానమ్

సేవ చేయడంలో విశ్వసనీయత ఉండాలి

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ సుబ్బారావు



మాట్లాడుతున్న రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ డాక్టర్ సుబ్బారావు

శామీర్‌పేట, జనవరి 19 : విద్యార్థులు విద్యను పూర్తి చేసిన తరువాత సేవ చేయడంలో, విధులను నిర్వర్తించడంలో విశ్వసనీయతను సంపాదించుకుంటూ, స్ఫూర్తిగా నిలుస్తూ అభివృద్ధి చెందాలని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ సుబ్బారావు అన్నారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్(ఐపీఈ) కళాశాలలో అధ్యక్షుడు మాధవరావు ఆధ్వర్యంలో స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ సుబ్బారావు విచ్చేసి కళాశాల అధ్యక్షుడు మాధవరావు, డైరెక్టర్ శ్రీనివాసమూర్తిలతో కలిసి పీజీడీఎం విద్యను పూర్తి చేసిన 443 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ పనిపట్ల మక్కువ, ఏ పని చేసినా అభిరుచితో చేస్తూ గొప్ప ఫలితాలను సాధించాలన్నారు. ఆయన ఆర్‌బీఐలో పనిచేసిన అనుభవాలను ప్రస్తావిస్తూ విధుల నిర్వహణలో అట్టడుగు స్థాయి వాటాదారులకు అనుసంధానం కావాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఏదైన ముఖ్యమనుకుంటే దానికోసం అధిక సమయాన్ని కేటాయించాలని ఆయన చెప్పారు. నేర్చుకోవడమనేది జీవితకాల ప్రక్రియ అని, పరస్పర చర్యలు పరిశీలనల ద్వారా నేర్చుకోవడం ఎంతో ఉత్తమమని సూచించారు. కళాశాల అధ్యక్షుడు మాధవరావు స్వాగతోపన్యాసం చేశారు. కళాశాల డైరెక్టర్ శ్రీనివాసమూర్తి సంస్థ చరిత్ర, వైభవాన్ని వివరించారు. కాగా ఈ స్నాతకోత్సవంలో ఐపీఈ కళాశాలో 2023లో పీజీడీఎం కోర్సును పూర్తి చేసిన విద్యార్థి ఎ.అదిత్య కు ఉజ్వల్ ముద్దన మెమోరియల్ గోల్డ్‌మెడల్ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్‌లు ప్రొఫెసర్ శ్రీకాంత్, ప్రొఫెసర్ లక్ష్మీకుమారి, ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ రావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

కొడంగల్ బైపాస్ రోడ్డు భూసేకరణకు చర్యలు


కొడంగల్, జనవరి 19: మహబూబ్‌నగర్-చించోలి హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా కొడంగల్ బైపాస్ రోడ్డుకు భూసేకరణకు అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం కొడంగల్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆర్డీవో, తహసీల్దార్ బీ.విజయ్‌కుమార్ రైతులతో సమావేశం నిర్వహించారు. మహబూబ్‌నగర్-చించోలికి హైవే కొడంగల్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద బైపాస్‌తో మురారి ఫంక్షన్ హాలు పక్క నుంచి తాండూర్ రోడ్డుకు అనుసంధానం కానుందన్నారు. ఇందుకు అవసరమయ్యే భూముల సేకరణకు రైతులతో సమీక్షించారు. రైతులకు ప్రభుత్వం ఇచ్చే పరిహారంపై వివరించారు. కొడంగల్ అభివృద్ధికి నిర్మిస్తున్న బైపాస్ రోడ్డుకు రైతులు సహకరించాలని కోరారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడికి సన్మానం


దోమ, జనవరి 19: వికారాబాద్ జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియామకం అయిన సదానందరెడ్డిని శుక్రవారం అయినాపూర్ గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుగ్గయ్య, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు గుడ్ల రాజు, ఆనంద్‌కుమార్, శ్రీనివాస్, బొంపల్లి నర్సిములు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కొడంగల్, జనవరి 19: ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాన్ని 18సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కొడంగల్ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 1 జనవరి 2024 నాటికి 18ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదయ్యేందుకు శని, ఆదివారాలు రెండు రోజులు ప్రత్యేక కార్యక్రమాన్ని అన్ని పోలింగ్ కేంద్రాల్లో చేపడుతున్నట్లు చెప్పారు. పాత ఓటర్లు ఏవైనా మార్పులు, చేర్పులుంటే ఫారం-8 నింపి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు అందుబాటులో ఉంటారని చెప్పారు.



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



మాట్లాడుతున్న తాండూరు ఆర్డీవో శ్రీనివాస్‌రావు

18ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదవ్వాలి

తాండూరు రూరల్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 18ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో శ్రీనివాసరావు సూచించారు. నేడు, రేపు నియోజకవర్గంలోని 269పోలింగ్ కేంద్రాల్లో క్యాంప్‌లు ఉంటాయన్నారు. బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, ఓటరు నమోదు, తప్పులు, చిరునామా మార్పులు, డబుల్ ఓటర్ల తొలగింపు, చనిపోయిన వారి పేర్ల తొలగింపునకు దరఖాస్తులు స్వీకరిస్తారని, ఉచితంగానే ఫామ్‌లు ఇస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

కులకచర్ల, జనవరి 19: చౌడాపూర్ మండలంలోని కొత్తపల్లి తండా, పురసంపల్లి గ్రామాల్లో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్రప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన గ్రామీణ ప్రాంత ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను చేరవేసే విధంగా అవగాహన కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు వెంకటయ్య, ఉమ్లా, ఎంపీటీసీ బ్రహ్మానందరెడ్డి, రాములు, ఎంపీహెచ్‌వో ఈవో, పంచాయతీ కార్యదర్శులు గురునాథ్‌రెడ్డి, నవీన్‌కుమార్, ఏఎన్ఎంలు పుష్పలత, ఇందిర, అశ్వినినాయక్, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, నర్సింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య విగ్రహ ప్రతిష్ఠ చరిత్రాత్మకం

▸▸ ముదిరాజ్ సంఘం మండల ప్రధాన కార్యదర్శి చందు

దోమ, జనవరి 19: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన చరిత్రాత్మక ఘట్టమని, దాన్ని వీక్షించేందుకు దేశ, విదేశాల ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని ముదిరాజ్ సంఘం మండల ప్రధాన కార్యదర్శి చందు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 22న కొన్ని రాష్ట్రాలు సెలవు ప్రకటించాయని, తెలంగాణలో కూడా సెలవు ప్రకటించాలన్నారు. ఆ రోజు జీవహింస జరగకుండా చూడాలని చెప్పారు.

ప్రపంచ స్థాయి కరాటే పోటీలకు 150 మంది క్రీడాకారుల ఎంపిక

పరిగి, జనవరి 19: ట్రెడిషనల్ జపాన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు జె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ నెల 24న నగరంలో నిర్వహిస్తున్న ప్రపంచ నఖయామ షోటకాన్ పోటీలో జిల్లా నుంచి 150 మంది కరాటే ఆటగాళ్ళు హాజరవుతున్నారు. దీనికి సంబంధించి జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి పోస్టర్లను విడుదల చేయించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జె.శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లా నుంచి ఈ సారి ఎక్కువ సంఖ్యలో హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రపంప స్థాయి పోటీలో పాల్గొని మంచి ప్రతిభను కనబరిచి జిల్లా పేరుప్రతిష్టలు తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు ఎం.బ్రహ్మాచారి, ఎం.శ్రీనివాస్, బి.వెంకటయ్యలు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఎస్పీ, కరాటే మాస్టర్లు

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్/పరిగి, జనవరి 19: వికారాబాద్‌లో గల మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో 2024-25 సంవత్సరానికి ప్రవేశానికిగాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గురుకులం ప్రిన్సిపాల్ రత్లావత్ పకీర శుక్రవారం తెలిపారు. 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు దరఖాస్తులను ఆహ్వానించామన్నారు. ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల/కళాశాలలో దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు వివరాల కోసం 9959746436 అనే నంబర్లో సంప్రదించాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సైతం చేసుకోవచ్చున్నారు. పరిగి బాలుర మైనార్టీ రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్ ఎం.తావుర్యానాయక్ మాట్లాడుతూ పాఠశాల/కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో అడ్మిషన్లకు ఫిబ్రవరి ఆరులోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ముస్లిం, క్రిస్టియన్, జైన్, సిక్కులతో పాటు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. మరిన్ని వివరాలకు 9010984174/ 9652555841/ 9676927579 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.



రక్తమైసమ్మకు బోనాలు

తాండూరు రూరల్, జనవరి 19: పర్వతాపూర్‌లో శుక్రవారం రక్తమైసమ్మతల్లికి బోనాల కార్యక్రమాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. స్థానికులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం డప్పువాయిద్యాల మధ్యన మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. బోనాలతో ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పాడి పంటలను చల్లగా చూడాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని గ్రామస్థులు వేడుకున్నారు. సర్పంచ్ లాల్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.


మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం

డిగ్రీ కళాశాల భవనాన్ని అందుబాటులోకి తెస్తాం

● ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, జనవరి 19: వినోభానగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని అందుబాటులోకి తేవాలని కళాశాల అధ్యాపక బృందం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరింది. శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి అధ్యాపకులు వినతి పత్రం అందజేశారు. రెండు నెలల్లో భవనం పనులు పూర్తి చేయించి అందుబాటులోకి తెస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఆయన్ను కలిసిన వారిలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.ప్రభు, అధ్యాపకులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆమనగల్లు, జనవరి 19: మండలంలోని ఆకుతోటపల్లి, ఆవురుపల్లి ఇండస్ట్రీస్, ప్రజ్వల హోమ్స్ ఏరియాలో నేడు(శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సీతారామ్ తెలిపారు. 11 కేవి ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 10:30 గంటలకు మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు అంతరాయాన్ని గుర్తించి సహకరించాలని ఆయన కోరారు.

చేవెళ్ల మండల పరిధిలో..

చేవెళ్ల, జనవరి 19 : మండల పరిధిలోని పలు గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ మహ్మద్ జానీ మోయినుద్దీన్ స్పష్టం చేశారు. చేవెళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆలూర్ ఫీడర్ 33కేవీలో మరమత్మల కారణంగా విద్యుత్ స్తంభాల వద్ద చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దేవునిఎర్రవల్లి, ఊరెళ్ల, గొల్లపల్లి, కొత్తపల్లి, చనువల్లి, బస్తేపూర్, ఖానాపూర్, ఆలూర్, కౌకుంట్ల, అంతారం, దుద్దాగు, దేవరంపల్లి, నాన్‌చేరి తదితర గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

యాచారం పరిధిలో..

యాచారం, జనవరి 19 : మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తులు, ఎల్టీ వైర్లు, 11 కేవీ వైర్ల కింద ఉన్న చెట్ల నరికివేత కారణంగా శనివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సందీప్ తెలిపారు. యాచారం, నక్కగుట్టతండా, మొగుల్లవంపు, తక్కళ్లపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం ఐదు గంటల తరువాత విద్యుత్ సరఫరాను కొనసాగిస్తామన్నారు.

షాబాద్ మండలంలో..

షాబాద్, జనవరి 19 : నేటి నుంచి షాబాద్ మండలంలో అన్ని సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ నరేందర్ తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, బ్రేకర్ల మరమ్మతులు, వైర్లకు తగులుతున్న చెట్ల తొలగింపు కారణంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20న పోలారం సబ్‌స్టేషన్, 22, 23, 24, 25, 27వ తేదీల్లో తాళ్లపల్లి సబ్‌స్టేషన్‌లో, 28న చందన్‌వెల్లి సబ్‌స్టేషన్‌లో, 29, 30, 31, ఫిబ్రవరి 1, 2, 3, 4, 5, 6, 7, 8వ తేదీల్లో బొబ్బిలిగామ, అంతారం సబ్‌స్టేషన్లలో, 9, 10, 11వ తేదీల్లో హైతాబాద్, చందన్‌వెల్లి ఇండస్ట్రియల్ పార్క్ ఫీడర్ల పరిధిలో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

వివేకానంద సేవా పురస్కారం స్వీకరించిన సదానందస్వామి


అవార్డు అందుకుంటున్న సదానందస్వామి

కందుకూరు జనవరి 18: అన్నోజిగూడ గ్రామానికి చెందిన కాకి సదానందస్వామి ముదిరాజ్ శుక్రవారం స్వామి వివేకానంద సేవా పురస్కారం 2024 అవార్డును అందుకున్నారు. నవభారతి నిర్మాణ ఫౌండేషన్ సంస్థ ఆద్వర్యంలో నగరంలోని తెలంగాణ పరిషత్ ఆడిటోరియంలో స్వామి వివేకానంద జయంతి ముగింపు ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసనమండలి డిప్యూటీచైర్మన్ బండ ప్రకాశ్‌ముదిరాజ్, ఎమ్మెల్సీ బి.దయానంద్‌గుప్త సినీ నటుడు బాబుమోహన్, చేతుల మీదుగా సదానంద స్వామి అవార్డును అందుకున్నారు. తన సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. నిర్వాహకులు రాజ్‌నారాయణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'భూ కబ్జా ఆరోపణలు సరికాదు'

శంకర్‌పల్లి, జనవరి 19 : తాను భూ కబ్జాకు పాల్పడుతున్నట్లు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం సరికాదని, అలా చేస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజూనాయక్ అన్నారు. శుక్రవారం ఆయన శంకర్‌పల్లిలో విలేకరులతో మాట్లాడుతూ కొండకల్ గ్రామంలోని 181, 184 సర్వే నెంబర్లలో 16 గుంటల భూమిని నర్సింహ, గోపాల్, సుధాకర్ అనే వ్యక్తుల నుంచి కొనుగోలు చేశామని అన్నారు. గురువారం భూమిని చదును చేస్తుండగా కొందరు భూమిని కబ్జా చేస్తున్నానని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని, వారిపై మోకిల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. తాను ఎలాంటి భూ కబ్జాకు పాల్పడలేదని, న్యాయ బద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నానని తెలిపాడు.

ఎస్సీ వర్గీకరణకు చొరవ తీసుకోవాలి

కందుకూరు, జనవరి 19 : ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ (టీఎస్) రాష్ట్ర కోర్ కమిటీ మెంబర్ చిన్నగళ్ల యాదయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఆ సంఘం నేతలతో కలిసి పూలమాలవేసి మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు వెండి పాపయ్య ఆదేశానుసారం వర్గీకరణ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. మహేశ్వరం నియోజకవర్గ నూతన కమిటీని అధ్యక్షుడిగా వి.దాసు, కందుకూరు మండలాధ్యక్షుడిగా గడ్డం రాంచంద్రి, మండల కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చిన్నగళ్ల బాల్‌రాజ్, అధికార ప్రతినిధిగా మందకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా టి.బాల్‌రాజ్‌ను నియమించినట్లు చెప్పారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

● మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి


పార్టీలో చేరిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులతో లక్ష్మారెడ్డి

మహేశ్వరం, జనవరి 19 : మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి పూర్వ వైభవం తేవాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం తుక్కుగూడ మునిసిపాలిటీ పరిధిలోని బానగూడ తండాకు చెందిన పలువురు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు చేరవేయడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. పది సంవత్సరాలు కాంగ్రెస్ కార్యకర్తలను బీఆర్ఎస్ నాయకులు ఇబ్బందులకు గురి చేశారని, కాంగ్రెస్ ప్రజల పక్షాన నిలబడి పని చేయాలని పిలుపునిచ్చారు. లక్ష్మణ్‌నాయక్, శేఖర్, చంద్రశేఖర్‌రెడ్డి, జానకీరామ్, రాజ్‌కుమార్, వై. జంగయ్య, లక్ష్మీనారాయణగౌడ్, పాల్గొన్నారు.

మహిళలు టైలరింగ్‌తో ఉపాధి పొందాలి


మహిళలకు కుట్టుమిషన్లు అందిస్తున్న నిర్వాహకులు

చేవెళ్ల, జనవరి 19 : మహిళలు స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికంగా వృద్ధి చెందాలని కేపీ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ టి.రాజ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని కమలానగర్ కాలనీలో పది రోజులుగా ఉషా ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారి ఆర్థిక సహకారంతో కేసీ ఫౌండేషన్ సౌజన్యంతో టైలరింగ్‌లో మహిళలకు ఉచితంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం శిక్షణ పూర్తిచేసుకున్న 10 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందించారు. ఈసందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాల్లోని పలు మండలాల్లో మహిళలకు ఉచిత టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. చేవెళ్లలో మరిన్ని శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు శశికుమార్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులను పూర్తి చేయాలి


ఆర్అండ్‌బీ ఈఎన్‌సీతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

షాద్‌నగర్, జనవరి 19: కొత్తూర్ నుంచి సోలీపూర్ వైజంక్షన్ వరకు చేపట్టిన పాత జాతీయ రహదారి విస్తరణ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఈఎన్‌సీ రవీందర్‌రావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తూర్ నుంచి షాద్‌నగర్ చౌరస్తా వరకు చేపట్టిన జాతీయ రహదారి విస్తరణ పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను దశల వారిగా చెల్లిస్తామన్నారు. అదే విధంగా షాద్‌నగర్ చౌరస్తా నుంచి సోలీపూర్ వైజంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులు కూడా పూర్తి చేయాలని కోరారు. నిధుల మంజూరులో ఎలాంటి కొరత ఉండదని భరోసానిచ్చారు. త్వరలోనే రోడ్డు విస్తరణ పనులు చేపడతామని ఈఎన్‌సీ ఎమ్మెల్యేకు తెలిపారు.

ఓటు నమోదు శిబిరాలను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న ఆర్డీవో మాధవరావు

షాద్‌నగర్/మంచాల/కేశంపేట/ఆమనగల్లు, జనవరి, 19: ఓటరు నమోదుకు ఈ నెల 22 తుది గడువని, ఓటరు నమోదు ప్రక్రియ వేగం పెంచేందుకు నేడు, రేపు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలను ఏర్పాటు చేశామని, అర్హులందరూ వినియోగించుకోవాలని షాద్‌నగర్ ఆర్డీవో వెంకటమాధవరావు తెలిపారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. 2024 జనవరి 1 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఫిబ్రవరి 2 వరకు అభ్యంతరాలు, దరఖాస్తులను పరిశీలించి 8న ఓటరు జాబితాను ప్రకటిస్తామన్నారు. ప్రస్తుతం షాద్‌నగర్ నియోజకవర్గంలో 2లక్షల 37వేల, 945 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో 1,19,698 మంది పురుష ఓటర్లు, 1,18,233 మంది మహిళా ఓటర్లు, 14మంది ట్రాన్స్ జెండర్ పర్సన్ ఓటర్లు ఉన్నారని చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 6021 మంది ఓటుహక్కు కోసం నమోదు చేసుకున్నారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో 3076 మంది ఓటర్లు మరణించగా, 891 డబుల్ ఓట్లను తొలిగించామని చెప్పారు. ఓటరు జాబిత సవరణలు చేసుకోవాలనుకునే వారు ఫాం-8ను వినియోగించుకోవాలన్నారు. తహసీల్దార్ పార్థసారథి పాల్గొన్నారు. అదేవిధంగా 18 ఏళ్లు నిండిన యువత ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని మంచాల మండల తహసీల్దారు ప్రసాద్‌రావు సూచించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొత్త ఓటు నమోదు, చేర్పులు, మార్పుల కోసం ఈ నెల నేడు, రేపు ప్రత్యేక క్యాంపెయిన్‌ను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. వివిధ పోలింగ్ స్టేషన్లలో బూత్‌లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ అవకాశాన్ని అర్హత గల వారందరూ సద్వినియోగం చేసుకుని ఓటుహక్కును నమోదు చేసుకోవాలని చెప్పారు. అలాగే కేశంపేట మండలంలో నేడు, రేపు ఓటు నమోదుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మీర్ అజాంఅలీ తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో బీఎల్‌వోలు ఫాం 6, ఫాం 7లను తీసుకుంటారని చెప్పారు. అలాగే ఆమనగల్లు మండలంలోని 35 పోలింగ్ బూత్‌ల పరిధిలో నేడు, రేపు(శని, ఆది) ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ లలిత తెలిపారు. 2024 జనవరి 1వ తేదీ వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటు హక్కు కొరకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. అన్ని పోలింగ్ భూత్‌లలో రెండు రోజులు బీఎల్వోలు అందుబాటులో ఉంటారని, ఓటర్ల జాబితాలో ఏమైనా సవరణలు, మార్పులు ఉన్నా దరఖాస్తు చేసుకోవచ్చని ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు.

సరిగా కనిపించని ఓటరు లిస్టు

కేశంపేట, జనవరి 19: మండలంలోని ఎక్లాస్‌ఖాన్‌పేటలో పోలింగ్ బూత్ నెంబరు 114లో గోడలకు అతికించిన ఓటరు లిస్టు స్పష్టంగా కనిపించడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాలతో నూతనంగా నమోదు చేసుకున్న ఓటర్ల పేర్లు కనిపించేలా ఆయా పోలింగ్ బూత్‌లలో బీఎల్వోలు లిస్టును గోడలకు అతికిస్తున్న విషయం తెలిసిందే. పోలింగ్ బూత్ నెంబర్ 114లో నూతన ఓటరు లిస్టు ఎవరికీ కనబడకుండా తలుపుపై భాగంలో అతికించారు. ఓటరులిస్టు ఇలా అతికించడంలో ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అనుమతి లేని కట్టడం కూల్చివేత


చెన్నం చెరువులో అక్రమ కట్టడాన్ని కూలుస్తున్న రెవెన్యూ సిబ్బంది

కేశంపేట, జనవరి 19: మండల పరిధిలోని బైర్ఖాన్‌పల్లి గ్రామ శివారులోని చెన్నం చెరువులో ఎఫ్టీఎల్ అనుమతి లేకుండా నిర్మిస్తున్న ఓ కట్టడాన్ని రెవెన్యూ అధికారులు కూల్చేశారు. బైర్ఖాన్‌పల్లి నుంచి కేశంపేటకు వెళ్లే మార్గంలో సర్వే నెంబర్ 9లో చెన్నంచెరువులో పలువురికి పట్టా పొలం ఉంది. హైదరాబాద్‌కు చెందిన తరుణ్‌వర్మ ఇటీవల సర్వే నెంబర్ 9లో కొంత పొలాన్ని కొనుగోలు చేసి, వ్యవసాయేతర భూమిగా మార్చుకున్నాడు. గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండానే తాను కొనుగోలు చేసిన పొలం చుట్టూ ప్రహరితో పాటు ఓ ఇంటిని నిర్మించాడు. అయితే సర్వే నెంబర్ 9 ఫుల్‌ట్యాంక్ లెవెల్ (ఎఫ్టీఎల్)లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎఫ్టీఎల్‌లో నిర్మాణాలు చేపట్టడాన్ని గమనించిన తహసీల్దార్ మీర్ అజాంఅలీ శుక్రవారం కట్టడాని కూల్చివేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈమేరకు రెవెన్యూ సిబ్బంది చెరువులోని అనుమతి లేని కట్టడాలను పాక్షికంగా కూల్చేశారు. కూల్చివేతలలో రెవెన్యూ అధికారుల తీరు పలు అనుమానాలను కలిగిస్తోంది. పూర్తిస్థాయిలో ఎందుకు కూల్చలేదో చెప్పాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు ఆలయాల ముస్తాబు


శక్తికేంద్రాల ఇన్‌చార్జిలతో కలిసి మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

మంచాల, జనవరి 19 : అయోధ్యలో ఈ నెల 22న శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో స్థానికంగా ఉన్న ఆలయాలను ఉత్సవాలకోసం ముస్తాబు చేయాలని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జి.లచ్చిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ శక్తికేంద్రాల ఇన్‌చార్జిల సమావేశం శుక్రవారం మండలకేంద్రంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత్ వికసిత్‌యాత్ర, అయోధ్యలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భవ్యమందిర ప్రారంభోత్సవాలను పురస్కరించుకుని స్థానికంగా ఉన్న ఆలయాలను పరిశుభ్ర పరచాలని శక్తికేంద్రాల ఇన్‌చార్జిలకు చెప్పారు. 22న సాయంత్రం దేవాలయాలు, ఇళ్లముందు దీపాలు వెలిగించేందుకు భక్తులను సమాయత్తపరచాలన్నారు. బీజేపీ రాష్ట్రనాయకుడు వింజమూరి వెంకట్‌రెడ్డి, దన్నెబాషయ్య, మారమోని శ్రీశైలం, గడ్డంరాజేందర్‌రెడ్డి, పాండాల జంగయ్య, బండిరాజు తదితరులు పాల్గొన్నారు.

'సంకల్ప యాత్ర'ను సద్వినియోగం చేసుకోవాలి


బాచుపల్లిలోని పంట పొలాల్లో మందు పిచికారీ యంత్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ మంద జ్యోతి, సర్పంచ్ శ్రీనివాస్

కందుకూరు జనవరి 19: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మంద జ్యోతి అన్నారు. శుక్రవారం బాచుపల్లి గ్రామంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్థులకు వివరించారు. వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి రైతులు సాగు చేస్తున్న పంటలపై రసాయనిక మందులు పిచికారి చేసే యంత్రంపై రైతులకు అవగాహన కల్పించారు. నోడల్ అధికారి మహేష్, వ్యవసాయ శాఖ అధికారులు రవీందర్, వార్డు సభ్యులు విన్సెంట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, రైతులు భూపాల్‌రెడ్డి, పాతిమరెడ్డి, పాల్గొన్నారు.

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

కేశంపేట, జనవరి 19: 2047 వరకు భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలపడం కోసం ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రొల్లు రాముగౌడ్ అన్నారు. మండలంలోని తొమ్మిదిరేకుల, తూర్పుగడ్డ తండా, పుట్టోనిగూడెం, వేముల్‌నర్వ, సంగెం, పొల్కొనిగుట్ట తండా గ్రామాలలో శుక్రవారం వికసిత్ సంకల్ప్ యాత్రను నిర్వహించారు. కేంద్రప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి వివరించారు. సర్పంచ్ రేణుక, ఎంపీటీసీ యాదయ్య, ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, ఎంపీవో నరసింహులు, ఏపీఎం భగవంతు, ఏఈవోలు వినయ్, లలిత, పంచాయతీ కార్యదర్శులు, మోటే శ్రీనివాస్, విఠల్ గౌడ్, నరసింహ, కృష్ణయ్య, శివచారి, మహేష్, రెడ్యా నాయక్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జయహో సమావేశాన్ని జయప్రదం చేయాలి

ఆమనగల్లు, జనవరి 19 : పట్టణంలో రేపు నిర్వహిస్తున్న జయహో సమావేశాన్ని విజయవంతం చేయాలని జైభారత్ రాష్ట్ర కార్యదర్శి రాజు తెలిపారు. హిందూ, ముస్లింల ఐక్యతే జయహో ధ్యేయమని ఆయన అన్నారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం జైభారత్ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండలాధ్యక్షుడు జహంగీర్ పాష అధ్యక్షతన జరిగిన సమావేశంలో జయహో సమావేశం విజయవంతం గురించి చర్చించారు. సమావేశానికి సంబంధించి రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జహంగీర్‌పాషా, శివ, అలీం, హరికృష్ణ, వినోద్, జావేద్, మున్న, తదితరులున్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జహంగీర్ పాష, నాయకులు

నేటి నుంచి గ్రామసభలు

ఇబ్రహీంపట్నం, జనవరి 19: 2024-25 సంవత్సరానికిగాను 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి గ్రామ పంచాయతీ ప్రణాళికను రూపొందించడానికి నేటి నుంచి జనవరి 23 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎంపీడీవో కె.వెంకటమ్మ తెలిపారు. ఈమేరకు 20వ తేదీన చెర్లపటేల్‌గూడ, దండుమైలారం, నాగన్‌పల్లి పోచారం, పోల్కంపల్లి, రాయపోల్, తుర్కగూడ, తులేకలాన్, ఉప్పరిగూడ, 22న కప్పాడు, కర్ణంగూడ, ముకునూరు, ఎలిమినేడు, 23న నెర్రెపల్లి గ్రామాల్లో గ్రామసభలు ఉంటాయని ఎంపీడీవో తెలిపారు.

రామ నామస్మరణతో మార్మోగిన మాచన్‌పల్లి

షాబాద్, జనవరి 19 : శ్రీరామ జన్మభూమిలో భవ్య రామ మందిరం నిర్మాణంతో దేశ ప్రజల చిరకాల కోరిక నెరవేరబోతుందని మాచన్‌పల్లి సర్పంచ్ మహేందర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యదర్శి మహేందర్ అన్నారు. శుక్రవారం గ్రామంలో అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.


అక్షింతలకు పూజ చేస్తున్న గ్రామస్తులు

ప్రభుత్వ భూమిని కాపాడాలి

కందుకూరు, జనవరి 19: కందుకూరు రెవెన్యూలోని సర్వే నెంబర్ 275, అన్నోజిగూడలోని సర్వే నెంబరు 15లో ఆక్రమనకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని గూడూరు మాజీ ఉపసర్పంచ్ గొర్రెంకల యాదయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ శశాంకను కలిసి వినతి పత్రం ఇచ్చారు. పలువురు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూమిలో ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నట్లు కలెక్టర్‌కు తెలిపారు. ఈ ప్రభుత్వ భూమిని సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేయాలని యాదయ్య కోరారు.

క్రైం కార్నర్

చెరువులో పడి వ్యక్తి గల్లంతు

కొత్తూర్, జనవరి 19: కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుమ్మరిగూడ గ్రామ శివారులో గల గోదుమకుంట చెరువులో పడి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. కుమ్మరిగూడ గ్రామానికి చెందిన ఈశ్వరయ్య(45) అనే వ్యక్తి గురువారం రాత్రి ఇంటి నుంచి బయలుదేరి చేపల వేట కోసం గోదుమకుంట చెరువు వద్దకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం వరకు ఈశ్వరయ్య ఇంటికి రాకపోవడంతో అతని కుటుంబసభ్యులు చెరువు వద్దకు వెళ్లి వెతికినా కనిపించలేదు. చెరువు కట్టపై అతని దుస్తులు ఉండటంతో కుటుంబసభ్యులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తన సిబ్బందితో కలిసి చెరువు వద్దకు వెళ్లి స్థానికులతో కలిసి గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి గాలింపు చేపట్టినా ఫలితం లేకపోయింది. రాత్రి కావడంతో గాలింపులు నిలిపివేశారు. కౌన్సిలర్ మాధవిగోపాల్‌గౌడ్ గాలింపు చర్యల్లో భాగస్వామ్యమయ్యారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా, ఈమేరకు సంఘటన స్థలాన్ని తహసీల్దార్ జానకి, ఆర్ఐ రాంబాబు పరిశీలించారు.


చెరువులో గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

కాంగ్రెస్ విధానాలతో రాష్ట్రానికి పెట్టుబడులు


ఎమ్మెల్యేతో కాసు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

ఆమనగల్లు, జనవరి 19 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పారిశ్రామిక రంగం అభివృద్ధి, నిరుద్యోగుల ఉపాధి కల్పనకు పెద్ద పీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి చొరవతో రాష్ట్రంలో రూ.37,870 కోట్ల పెట్టుబడులకు పలు కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పలు గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేను అభ్యర్థించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషిని జీర్ణించుకోలేక ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషప్రచారానికి ఒడిగట్టారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని శాఖల్లోని ప్రభుత్వ ఉద్యోగుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కేఎల్ఐ డీ-82 కాల్వ భూ నిర్వాసితులకు అందాల్సిన పరిహారం గురించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా సానుకూలంగా స్పందించినట్లు కసిరెడ్డి తెలిపారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఎంపీపీ లు కమ్లీమోత్యనాయక్, అనితవిజయ్, డీసీసీ అధికార ప్రతినిది గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, బీచ్యనాయక్, నాయకులున్నారు.

ఎస్జీటీలకు 'ఎమ్మెల్సీ' ఓటుహక్కు కల్పించాలి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

యాచారం, జనవరి 19 : ఎస్జీటీలకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కోశాధికారి డాక్టర్ జగన్నాథ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం యాచారం మండలంలోని గున్‌గల్ మోడల్ స్కూల్‌లో యూటీఎఫ్ 2024 క్యాలెండర్, తహసీల్దారు శ్రీకాంత్‌రెడ్డితో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా జగన్నాథ్ మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. అంతకుముందు నందివనపర్తి, కుర్మిద్ద, మేడిపల్లి, యాచారం తదితర గ్రామాల్లో పర్యటించి ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకున్నారు. యూటీఎఫ్ నాయకులు జంగయ్య, మండల అధ్యక్షకార్యదర్శులు నర్సింహా, అంజయ్య, నాయకులు రాథోడ్, కృష్ణవేణి, వెంకటేష్, యాదయ్య పాల్గొన్నారు.

బహుజనులకు రాజ్యాధికారం రావాలి


శ్రీశైలంకు నియామక పత్రం ఇస్తున్న దయానందరావు

షాబాద్, జనవరి 19 : బహుజనులకు రాజ్యాధికారం రావాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దయానందరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శిగా కర్రె శ్రీశైలంను ఏకగ్రీవంగా ఎన్నుకొని ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బహుజనులంతా ఏకమై రాజ్యాధికారం దిశగా ముందుకు సాగుదామని అన్నారు. కర్రె శ్రీశైలం మాట్లాడుతూ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బర్క కృష్ణ, జిల్లా అధ్యక్షుడు ప్రవీన్‌కుమార్, చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజమహేంద్రవర్మ, కార్యదర్శి సుధాకర్, నాయకులు ప్రభాకర్, శ్రీనివాస్, రవికుమార్, సతీష్, రమేష్ శ్రీశైలం, చందు, యాదయ్య, కృష్ణ, తదతరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి

శంకర్‌పల్లి, జనవరి 19 : గత ఐదేళ్లుగా ఎంతో శ్రమించి గ్రామాలను అభివృద్ధికి కృషి చేసిన సర్పంచులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా గ్రామాల్లో వైకుంఠ ధామాలు, నర్సరీలు, పల్లె ప్రకృతివనాలు, మౌలిక వసతుల కల్పనకు సహకరించిన సర్పంచులు, అధికారులకు అభినందనలు తెలిపారు. సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలన్నారు. జడ్పీటీసీ గోవిందమ్మ, తహసీల్దార్ సురేందర్, అధికారులు పాపారావు, వెంకయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కల్యాణ్ నాయక్‌కు సన్మానం



ఆమనగల్లు, జనవరి 19 : బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ కల్యాణ్ నాయక్‌ను శుక్రవారం మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమనగల్లు మండలం సాకిబండ తండాకు చెందిన కల్వకుర్తి నియోజకవర్గ బీజేపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి రవిరాథోడ్ ఆధ్వర్యంలో కల్యాణ్ నాయక్‌ను ఉస్మానియా వర్సిటీలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. నాయకులు నాగేందర్, కృష్ణ, రవి, రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు.